క్లుప్తంగా

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



అయిజ: గాంధీ జయంతిని పురస్కరించుకొని స్వచ్ఛ సర్వేక్షన్ 2023లో భాగంగా బుధవారం మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనంలో ఎఫ్ఎస్‌టీపీ, డంపింగ్ యార్డ్‌ల ఉపయోగాల గురించి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పట్టణంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అదేవిధంగా మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు చేయించారు. అనంతరం పెద్దవాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

గద్వాల అర్బన్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జలవనరుల పూర్తి చేయడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ ఇక్బాల్ పాష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గురువారం సాయంత్రం 4గంటలకు జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజా, ఉపాధ్యాయ, విద్యార్థి, రైతు సంఘాలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పశువులకు లంపీ స్కిన్ నివారణ టీకాలు

రాజోళి: పశువులకు సంక్రమించే లంపీ స్కిన్ వ్యాధి ప్రబలుతున్న క్రమంలో పశువైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. బుధవారం మండలంలోని పచ్చర్లలో ఆవులు, ఎద్దులకు వ్యాధి నివారణ టీకాలు వేశారు. 44 మంది రైతులకు చెందిన 152 ఆవులు, 164 ఎద్దులకు టీకాలు వేసినట్లు వెటర్నరీ సిబ్బంది తెలిపారు.

నేడు మహ్మద్ ప్రవక్త జయంతి వేడుకలు

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలో నల్లకుంటలోని ఉర్దూ భవన్‌లో గురువారం మహ్మద్ ప్రవక్త జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు మార్కజీ మిలాద్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ శఫీఉల్లా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు మహ్మద్ ప్రవక్త జీవిత చరిత్ర ఉపన్యాసం ఉంటుందని తెలిపారు. అనంతరం ఉర్దూ భవన్ నుంచి మిలాద్ జులుస్ ఊరేగింపు ప్రారంభించి ఒంటలపేటలోని మస్జీద్-ఏ-అన్వర్ వరకు కొనసాగించినున్నట్లు పేర్కొన్నారు. ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పశువైద్యశాలపై నిర్లక్ష్యం తగదు

రాజోళి: మండల కేంద్రం రాజోళిలో ఉన్న పశువైద్యశాలపై అధికారులకు, ప్రభుత్వానికి నిర్లక్ష్యం తగదని బీజేపీ మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి అన్నారు. బువారం ఆయన వైద్యశాలను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల కిందట నిర్మించిన భవనం పాతదై, కూలేందుకు సిద్ధంగా ఉందని, అలాంటి భవనంలోనే కాలం వెల్లదీయడం తగదన్నారు. అందులో విషసర్పాలు సంచరిస్తున్నాయని, గతంలో సిబ్బంది చెప్పినా స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి నూతన భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు.

ఓటరు జాబితాలో తప్పులు సరిచేయండి

గద్వాల రూరల్: ఇటీవల విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాలో తప్పులు దొర్లాయని, వాటిని సరిచేసి అర్హులైన వారికి ఓటుహక్కు కల్పించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి కోరారు. బుధవారం సాయంత్రం ఆయన కలెక్టర్ వల్లూరు క్రాంతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గట్టు మండలం అధ్యక్షుడు బలిగెర శివారెడ్డి, పులిపాటి వెంకటేష్, డీటీడీసీ నర్సింహులు, నాగేంద్రయాదవ్, భాస్కర్‌యాదవ్, నెమలికంటి రామాంజనేయులు, దౌలు పాల్గొన్నారు.

చిరు దుకాణాల్లో చోరీ



కేటీదొడ్డి: మండలంలోని మైలగడ్డ స్టేజీ సమీపంలో కిరాణం, కూల్‌డ్రింక్స్ దుకాణాల్లో బుధవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. రేకులతో ఉన్న దుకాణాల్లో రేకులు కట్‌చేసి కొంత నగదు, కిరాణం సరుకులను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేటీదొడ్డి ఎస్ఐ వెంకటేష్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కొండా లక్ష్మణ్‌బాపూజీకి ఘన నివాళి

- గ్రామాల్లో జయంతి వేడుకలు
- చిత్రపటాలకు పూలమాలలు వేసిన ప్రజాప్రతినిధులు, నాయకులు



గట్టులో కొండాలక్ష్మణ్ బాపూజీకి నివాళులర్పిస్తున్న చేనేత కార్మికులు

గద్వాల అర్బన్: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని బుధవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాతబస్టాండులో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పులిపాటి వెంకటేష్ మాట్లాడారు. కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. పద్మశాలి సంఘం జిల్లా కన్వీనర్ కోట నర్సింహులు, కో కన్వీనర్ శ్రీమన్నారాయణలు క్రిష్ణవేణి చౌరస్తాలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కేటీదొడ్డి: స్వాతంత్య్ర సమర యోధుడు తెలంగాణ తొలిదశ ఉద్యమ నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని డిప్యూటీ తహసీల్దార్ శివశంకర్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ధరూరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వహీదా ఖాతున్ సీనియర్ అసిస్టెంట్ నాగేష్‌లు బాపూజీ చిత్ర పటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో ఆర్ఐలు లతీఫ్, నరేష్, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మన్ పాల్గొన్నారు.

గట్టు: మండల కేంద్రంలో చేనేత కార్మికులు బస్టాండ్ ఆవరణలో కొండాలక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో చేనేత సంఘం పర్సన్ ఇన్‌చార్జ్, మాజీ అప్కో డైరెక్టర్ దోమ వీరన్న పాల్గొన్నారు.

శాంతినగర్: స్వాతంత్య్ర సమరయోధుడు, తెలంగాణ ఉద్యమానికి దిక్సూచి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని శాంతినగర్‌లో ఘనంగా నిర్వహించారు. నడిగడ్డ హక్కుల పోరాట సమితి నియోజకవర్గ సమన్వయకర్త నాగేష్‌యాదవ్ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూలతో పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో గొనింటి వీరేష్, కిషోర్, రాజోలి వీరేష్, వెంకటేష్, వేణు, శ్రీను, వీరన్నలు పాల్గొన్నారు.

అయిజ: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రదీప్‌కుమార్, భగత్‌రెడ్డి, వెంకటేష్, శివన్న పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డీటీ నందిని, ఆర్ఐ ప్రశాంత్‌గౌడ్ ఉన్నారు. బీఎస్పీ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ ఎంజీ కృష్ణ, తిరుపాల్, మధు, రాముడు, వెంకటేష్ ఉన్నారు.



కేటీదొడ్డిలో..



ఇటిక్యాలలో..



ధరూరులో..

స్వచ్ఛత అందరి బాధ్యత



టూరిజం డే సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

అలంపూర్: స్వచ్ఛత అనేది అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్ అన్నారు. అలంపూర్ పట్టణంలోని శ్రీజోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి, నవబ్రహ్మ ఆలయాల సముదాయంలో వరల్డ్ టూరిజం డే సందర్భంగా బుధవారం 'స్వచ్ఛత హీ సేవ' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు, ఆర్కియలాజికల్ అధికారులు, విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లో, నవబ్రహ్మ ఆలయ పరిసర ప్రాంతాల్లో క్లీనింగ్ చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, ఆర్కియలాజికల్ సీఐ నవీన్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పండ్ల తోటలకు దరఖాస్తు చేసుకోండి



అభివృద్ధి పనులను వివరిస్తున్న ఎంఈఓ

శాంతినగర్: చిన్న, సన్నకారు రైతులందరు పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తులు చేసుకోవాలని ఏపీఓ విజయలలిత అన్నారు. వడ్డేపల్లి మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ రజిత అధ్యక్షతన ఐకేపీ భవనంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు వారి శాఖల్లో ఇటీవల జరిగిన అభివృద్ధి పనుల గురించి సభ్యులకు వివరించారు. ఏపీఓ, తహసీల్దార్ జ్యోతి మాట్లాడుతూ రేషన్ కార్డులో ప్రతి ఒక్కరూ కేవైసీ అప్డేట్ చేయించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు తహసీల్దార్ సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవీంద్ర, ఎంఈఓ నరసింహులు, ఎంఈఓ రాధ, ఆయా శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

కళాశాల హాస్టళ్లు తరలిస్తే ఊరుకోం



మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఎస్పీ నాయకులు, విద్యార్థులు

అలంపూర్: ప్రభుత్వ జూనియర్ కళాశాల హాస్టళ్లను మరో చోటికి తరలిస్తే ఊరుకోమని బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్ హెచ్చరించారు. అలంపూర్ పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు చెందిన హాస్టళ్లను తరలించొద్దని విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, తహసీల్దార్ మంజుల, ఎంపీడీఓ గోవింద్‌రావులను కలిసి వినతిపత్రం అందజేశారు. బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన బాలికల, బాలుర హాస్టళ్లను వేరే ప్రాంతానికి తరలించొద్దన్నారు. గతంలో నియోజకవర్గ కేంద్రానికి వచ్చిన డిగ్రీ కళాశాలను, 100 పడకల ఆస్పత్రిని వేరోక ప్రాంతానికి తరలించారని గుర్తు చేశారు. ప్రస్తుతం జూనియర్ కళాశాల హాస్టళ్లను తరలించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోకపోతే బీఎస్పీ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు సుంకన్న, సురేష్, నాగరాజు, ముప్పారపు, శరత్, విద్యార్థులు ఉన్నారు.

ఉద్యమకారుల త్యాగాలతోనే తెలంగాణ

గద్వాల అర్బన్: ఉద్యమకారుల పోరాటం, ప్రాణత్యాగాలతోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని, 1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు మోహన్‌రావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1969 ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి వచ్చే నెల 3న హైదరాబాద్‌లో లోయర్‌ట్యాంక్ బండ్ ధర్నాచౌక్ వద్ద ధర్నా చేపట్టనునున్నట్లు తెలిపారు. ఈ ధర్నాకు ఉద్యమకారులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం



లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల సంక్షేమాభివృద్ధి పథకాలకు ఆకర్షితులై పలువురు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో గట్టు మండలం ముచ్చోనిపల్లికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మల్దకల్ మండలం మద్దెలబండ, నీలిపల్లి, విఠలాపురం, బూడిదపాడు, అమరవాయి గ్రామాల మహిళా సంఘాలకు చెందిన మహిళలు పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి సర్పంచ్ బండ్ల జ్యోతి, ఎంపీపీ విజయ్‌కుమార్, మహేశ్వర్‌రెడ్డి, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, సరళమ్మ, లక్ష్మీదేవి, అరుణ పాల్గొన్నారు.

అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గద్వాల పట్టణానికి చెందిన 119లబ్ధిదారులకు, గద్వాల మండలానికి చెందిన 97మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, కౌన్సిలర్లు శ్రీనివాసులు, నరహరిగౌడ్, మురళి, నాగిరెడ్డి, మహేష్, దౌలు, కృష్ణ పాల్గొన్నారు.

సరుకుల పంపిణీ



గద్వాల అర్బన్: మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని ఎంఐఎం మండల అధ్యక్షుడు రఫీ సహకారంతో బుధవారం జిల్లా కేంద్రంలోని ఎంఐఎం పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కో-ఆర్డినేటర్ బాబేర్ బిన్ సయ్యద్ పేదలకు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు మున్నాబాషా, నాయకులు అల్తాఫ్ హుస్సేన్, ప్రసాద్, జాకీర్ హుస్సేన్, రఫీ, ఇమాముద్దీన్, గంజిపేట ఇలియాస్, అస్లాం ఉన్నారు.

చెవిలో పువ్వులతో అంగన్‌వాడీల నిరసన



నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

గద్వాల అర్బన్: 17రోజులుగా తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు వినూత్న పద్ధతుల్లో నిరసన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌మార్గ్‌లో అంగన్‌వాడీలు చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన వ్యక్తం తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఏమేలమ్మ మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్స్, ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నర్మద, ఫరీదా, అరుణ, జ్యోతి, శిరీష, సోమేశ్వరి ఉన్నారు.

బీజేపీలో చేరిక

గద్వాల: బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు బీజేపీలో చేరారు. గట్టు మండలం ఇందువాసి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులతో పాటు జిల్లా కేంద్రంలోని 30వ వార్డుకు చెందిన యువకులు బీజేపీలో చేరారు. వారికి డీకే అరుణ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

కేటీదొడ్డి మండల బీజేపీ నూతన అధ్యక్ష, కార్యదర్శులను నియమించారు. బీజేపీ మండల అధ్యక్షుడిగా హన్మిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మైలగడ్డ రాములను నియమించారు. వారికి బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ నియామక పత్రాలు అందజేశారు.

ఆశా కార్యకర్తల నిరసన



ధరూరులో సమ్మె చేస్తున్న ఆశా కార్యకర్తలు

ధరూరు: రాష్ట్ర ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరవధిక సమ్మె 3వ రోజుకు చేరింది. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గేటు ముందు సమ్మె చేపట్టారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు భాగ్యమ్మ, జ్యోతి, సమిత పాల్గొన్నారు.

రాజోళి: తమ సమస్యల పరిష్కారానికి ఆశా వర్కర్లు చేస్తున్న సమ్మెపై ప్రభుత్వం నిర్లక్ష్యం తగదని కేవీపీఎస్ నాయకులు విజయ్‌కుమార్ అన్నారు. ఆశా కార్యకర్తలు చేస్తున్న సమ్మెకు బుధవారం ఆయన సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, కేవీపీఎస్ నాయకులు పాల్గొన్నారు.

మానవపాడు: మండల కేంద్రంలోని ఆరోగ్యకేంద్రంలో ఆశా కార్యకర్తలు నిరసన చేపట్టారు. ఆశా కార్యకర్తలు వెంకటేశ్వరమ్మ, సంతోషమ్మ, మద్దమ్మ మాట్లాడారు. ప్రభుత్వం స్పందించి వెంటనే తమ సమస్యలను పరిష్కారించాలని కోరారు.

గద్వాల క్రైం: బస్తీ దవాఖాన ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆశా వర్కర్ల సంఘం నాయకురాలు పద్మ, సునీతలు మాట్లాడారు. కార్యక్రమంలో నాగ ప్రమీల ఉన్నారు.

మల్దకల్: మల్దకల్ పీహెచ్‌సీ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆశా కార్యకర్తల సంఘం సభ్యులు నర్సమ్మ, కాంతమ్మ, సుజాతలు మాట్లాడారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతినగర్: ఆశ కార్యకర్తల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని వడ్డేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఆశ కార్యకర్తలు మమత, అనసూయ, సైదమ్మ, ధనలక్ష్మి, రామలక్ష్మి, మహాలక్ష్మి, జానకమ్మ, లీలావతి, హైమావతిలు పాల్గొన్నారు.

సేవాగుణం గొప్పది



శాంతినగర్: కొందరు కేవలం మాటలు చెబుతారే గాని, సమాజానికి సేవ చేసే వారే గొప్పవారని కలీముల్లా మౌలానా అన్నారు. వడ్డేపల్లి పట్టణంలోని మారుతినగర్ ప్రాథమిక పాఠశాలలో శాంతినగర్‌కు చెందిన షేక్ అస్లాం షరీఫ్ తండ్రి షేక్ ఖాదర్ షరీఫ్ 28వ వర్ధంతిని విద్యార్థుల సమక్షంలో నిర్వహించారు. అస్లాం షరీఫ్ విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమిజాబి, ఉపాధ్యాయులు సులోచన, మాలిక్, రమేష్‌లు పాల్గొన్నారు.

29న సర్వసభ్య సమావేశం

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనంలో ఈ నెల 29న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సీఈఓ మద్దిలేటి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంఘంలోని డైరెక్టర్లు, సభ్యు లు, రైతులు హాజరుకావాలని సూచించారు.

పార్టీ పటిష్టతకు పనిచేయాలి



ధరూరులో కాంగ్రెస్ నాయకులతో చర్చిస్తున్న ఏఐసీసీ అబ్జర్వర్స్ సద్దుగౌడ, కావేరి

శాంతినగర్: పార్టీ పటిష్టత కోసం ప్రతి ఒక్కరు పని చేయాలని ఏఐసీసీ అబ్జర్వర్ సందీప్‌కుమార్ అన్నారు. వడ్డేపల్లి మండల నాయకులతో శాంతినగర్ క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో అబ్జర్వర్ సునీత, ఆయా గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ గెలుపును ఎవరూ ఆపలేరని ఏఐసీసీ అబ్జర్వర్స్ సద్దుగౌడ పాటిల్, కావేరి అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సేవాలాల్ చీఫ్ ఆర్గనైజర్, జనరల్ సెక్రటరీ జమాల్ జిల్లా యువజన ఉపాధ్యక్షుడు ఇలియాజ్, మండల అధ్యక్షుడు విశ్వనాథ్‌రెడ్డి, నాయకులు మజీద్, రియాజ్ ఉన్నారు.

ధరూరు: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్‌తో పాటు కాగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థ నాయకులతో ఏఐసీసీ అబ్జర్వర్స్ సద్దు గౌడ, కావేరిలు చర్చించారు. కార్యక్రమంలో జిల్లా సేవాదల్ చీఫ్ ఆర్గనైజర్ జమాల్, నరేందర్, గోవింద్ రెడ్డి ఉన్నారు.

నైపుణ్యం కోసమే డిజిటల్ తరగతులు



డిజిటల్ తరగతుల ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

శాంతినగర్: ఆంగ్లంలో నైపుణ్యం పెంచుకోవడానికే డిజిటల్ తరగతులు ఏర్పాటు చేసినట్లు ప్రధానోపాధ్యాయులు వెంకటనర్సమ్మ అన్నారు. వడ్డేపల్లి మండలంలోని కొంకల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ బతుకన్న, ఎంఈఓ నరసింహులు, మాజీ ఎంపీపీ నాగేశ్వర్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ రవి ఆధ్వర్యంలో బుధవారం డిజిటల్ తరగతులు ప్రారంభించారు. మంచు లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న 'టీచ్ ఫర్ చేంజ్' అనే ప్రోగ్రాంకు కొంకల పాఠశాల ఎంపికైందన్నారు. డిజిటల్ తరగతుల నిర్వహణకు సామగ్రిని మంచు లక్ష్మి అందిస్తున్నట్లు తెలిపారు. ఇంతమంచి కార్యక్రమానికి చేయూత అందించిన నటి మంచు లక్ష్మి, కలెక్టర్ వల్లూరు క్రాంతికి గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు పుష్పలత, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు విజయసారథిరెడ్డి పాల్గొన్నారు.

భూ వివాదంపై పంచాయితీ

గట్టు: మండల కేంద్రంలో భూ వివాద వ్యవహారంపై మనస్తాపంతో ఉల్లిగడ్డల కుర్వ ఈరన్న (65) మంగళవారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై బుధవారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. భూ వివాద నేపథ్యంలో రెండు కుటుంబాల మధ్య వివాదంపై మల్దకల్ ఎస్ఐ కల్యాణ్, గద్వాల రూరల్ ఎస్ఐ ఆనంద్‌లు గట్టుకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఉల్లగడ్డల కుర్వ ఈరన్న కుటుంబ సభ్యులకు ఏఆర్ కానిస్టేబుల్ చంద్రాములు సోదర కుటుంబ సభ్యులకు మధ్య కొంత కాలంగా భూ వివాదం కొనసాగుతోంది. ఒక వర్గానికి చెందిన కుర్వ ఉల్లిగడ్డల ఈరన్న మనస్తాపంతో పురుగుల మందును తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ వ్యవహారంపై గ్రామంలో పంచాయితీ నిర్వహించి, ఇరుకుటుంబాల మధ్య సెటిల్‌మెంట్ చేసినట్లు తెలిసింది. తనను బలవంతంగా పొలం రాయించుకున్నట్లు ఏఆర్ కానిస్టేబుల్ చంద్రాములు ఆరోపించారు. రైతు ఆత్మహత్య వ్యవహారంపై బుధవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నందికర్ తెలిపారు.

గణపతికి ఘనంగా పూజలు



గద్వాలలో పూజలు నిర్వహిస్తున్న డీకే అరుణ

గద్వాల: జిల్లా కేంద్రంలో గణేష్ మండపాలలో నిత్యం ప్రత్యేక పూజలు, అన్నదానం ఏర్పాటు చేస్తున్నారు. బుధవారం పట్టణం, గ్రామాలలో గణేశుడికి జెడ్పీ చైర్‌పర్సన్ సరిత ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని 19, 36వ వార్డుల పరిధిలోని గణేష్ మండపాలలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు.

అయిజ: మండల కేంద్రంలోని మండపాలవద్ద భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేసి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని టీచర్స్ కాలనీలో నిర్వహిస్తున్న గణపతి ఉత్సవాల్లో అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం పాల్గొని ప్రత్యేక పూజలు చేయించారు.

తహసీల్దార్‌కు సమ్మె నోటీస్



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు బుధవారం రెండో ఏఎన్ఎంలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరవధిక సమ్మెను చేపట్టారు. రెండో ఏఎన్ఎంలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చి, వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో వచ్చేనెల 5వ తేదీ నుంచి సమ్మెను చేపడతామని తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు నోటీస్ అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు విద్యావతి, మహేశ్వరి, ఎలిజబెత్, విశ్వనాథమ్మ ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో బుధవారం మానవపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీహెచ్ఓ సత్యనారాయణ, వైద్య సిబ్బంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ సంధ్య, హెచ్‌డబ్ల్యూఓ రామకృష్ణ ఉన్నారు.